## క్లుప్తంగా...

### దరఖాస్తులకు ఆహ్వానం

గౌలిపురా: ఈఎంఆర్ఐ (108) సంస్థలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రోగ్రామ్ మేనేజర్ జాన్‌షాహీద్‌షేక్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌ను తీసుకుని ఈనెల 27న ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌కు జీఎస్ఎం, ఏఎన్ఎం, డీఎంఎల్‌టీ, ఎంఎల్‌టీ, బీఎస్సీ (బీజెడ్సీ) అర్హతలు కలిగి ఉండి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. కింగ్‌కోఠిలోని 108 రీజినల్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9000001674.

### ఆకట్టుకున్న 'పరంపర' నాటక ప్రదర్శన


నాటకంలోని ఓ దృశ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ పర్యవేక్షణలో 'పరంపర' అనే నాటకాన్ని గురువారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. నాటి స్థితిగతులు నేటితరం ఆలోచన స్థితులను నాటకరూపంలో అద్భుతంగా ప్రదర్శించారని కొనియాడారు. రంగస్థల నటులు సుబ్బరాయశర్మ, రసరంజని కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సుల్తాన్‌బజార్: ఇందనల్ కంపెనీ వద్ద రైతులపై పోలీసుల దమనకాండను పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణరావులు మాట్లాడుతూ.. అక్టోబర్ 22న ఎక్లాస్‌పూర్ చిత్తనూర్, జిన్నారం గ్రామ ప్రజలు శాంతియుతంగా చేస్తున్న ధర్నాపై పోలీసులు దాడి చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా చేస్తున్న ధర్నాపై పోలీసుల చర్యలు సరికాదన్నారు. కంపెనీ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను నిల్వ చేయడానికి సరైన స్థలం కూడా లేదన్నారు. ఇటీవల కంపెనీ వారు పక్కనే ఉన్న మన్నెవాగులోకి విష రసాయన పదార్థాలను వదిలారని, ఆ ప్రభావంతోనే చేపలు, జింకలు, ఇతర వన్యప్రాణులు మృతిచెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తనూరు ఇందనల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 21 నారాయణపేట జిల్లా కలెక్టర్‌కు పరిస్థితిని రైతులు వివరించారన్నారు. ఈ విషయమై ఎమ్మార్వో పరిశీలించేందుకు రావడంతో పరిష్కరించే దిశగా దిశగా ట్యాంకర్‌ను చెక్ చేయాలని ఆదేశించారు. 22న ధర్నా చేస్తున్న వారిపై పోలీసులు లాఠీఛార్జీ చేసి రెండు ద్విచక్ర వాహనాలను దహనం చేశారన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లాఠీఛార్జీలో గాయపడిన గ్రామస్తులకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కంపెనీని మూయించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం



బహుమతిని అందుకుంటున్న క్రీడాకారిణి తేజావత్ సుకన్య

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బెంజ్ ప్రెస్ చాంపియన్‌షిప్ పోటీలలో నగరానికి చెందిన తేజావత్ సుకన్యభాయి స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి తేజావత్ రాంచంద్రుడు, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ ఎండీ వైవీ.గోపాలకృష్ణమూర్తిలు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్‌లో జరిగేటటువంటి జాతీయస్థాయి పోటీలలో గెలుపొంది రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దీనికి ఆమెకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తామని ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ సీఎండీ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. 76 కిలోల విభాగం, 140 కేజీల విభాగంలో రెండు స్వర్ణ పతకాలను సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# అటకెక్కుతున్న చెరువు సుందరీకరణ పనులు

**ప్రకటనలకే పరిమితమవుతున్నాయని విమర్శలు**


శాతం చెరువులో పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

గోల్కొండ: నగరంలోని చెరువుల పరిరక్షణ, సుందరీకరణకు ప్రభుత్వం, బల్దియా వారు గొప్పగా ప్రకటనలు ఇస్తున్నారు. చెరువుల స్థలాల కబ్జాను నిరోధిస్తామని, చెరువుల సుందరీకరణ పనులు వెంటనే చేపడతామని గత కొద్ది రోజుల నుంచి భారీగా పత్రికా ప్రకటనలు వస్తున్నాయి. ఈ సుందరీకరణ కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్వాన్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో ఉన్న పురాతన చెరువుల పరిరక్షణ కేవలం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలున్నాయి.

**పరిశీలనకే పరిమితం..**

ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లపై బల్దియాతో పాటు వివిధ శాఖల అధికారులు చెరువులను పరిశీలించి వెళ్తున్నారే తప్పా.. వాటి అభివృద్ధి, సుందరీకరణకు ఎలాంటి చర్యలు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకీ డివిజన్‌లోని చారిత్రక చెరువు పరిస్థితి నానాటికి అధ్వానంగా మారుతుంది. గత రెండు దశాబ్దాల నుంచి ఈ చెరువు సుందరీకరణ కాగితాలకే పరిమితమైంది. బల్దియా అధికారులు, మంత్రులు వచ్చి చెరువును చూసి వెళ్తున్నారు. అయితే ఈ చెరువుల అభివృద్ధికి సంబంధించిన ఫైల్స్ మాత్రం కార్యాలయానికే పరిమితమవుతున్నాయి. ఈ చెరువు నదీమ్ కాలనీ వాసులకు అత్యంత ప్రమాదకరంగా మారింది.

**వరదలతో తీవ్ర ఇబ్బంది..**

జూబ్లీహిల్స్ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు వల్ల శాతం చెరువు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంటుంది. అయితే భారీ వర్షాలు కురిసిన సమయంలో ఈ చెరువు నీరు దీన్ని ఆనుకుని ఉన్న నదీమ్ కాలనీని ముంచెత్తుతుంది. ప్రతి ఏటా చెరువు సుందరీకరణ పనులు అంటూ గుర్రపుడెక్క తొలగించడం, చెరువుల పూడికతీత పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**డంపింగ్‌తో కుదింపు..**

గుర్తు తెలియని వ్యక్తులు రోజూ టన్నుల కొద్ది వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. దీంతో శాతం చెరువు విస్తీర్ణం నానాటికి కుంచించుకుపోతుంది. అదే విధంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్‌లోని ఎర్రకుంట, కొత్తచెరువు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. ఈ చెరువులు దుర్గంధం వెదజల్లే చెరువులుగా పేరుగాయించాయి. కొత్త చెరువులో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగాయి.

**మినీ పార్కుగా అభివృద్ధి చేయాలి..**

చెరువులో ఓ వైపు వ్యర్థాల డంపింగ్ అధికంగా జరుగుతుంది. ఈ చెరువులను అభివృద్ధి చేసి చెరువుకు ఆనుకుని ఉన్న ప్రదేశంలో మినీ పార్కులుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# 12 బీర్లు.. 6 మద్యం బాటిళ్లు మాత్రమే..!

- ఒక్కో వ్యక్తికి మద్యం విక్రయంపై షరతులు
- విరుద్ధంగా వ్యవహరిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు
- సమయపాలన పాటించకపోతే కేసులు, చలాన్లు తప్పవు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

జంగ్ తెలంగాణ 2023

చార్మినార్: ఎన్నికల ప్రచారం అనగానే కొంత మంది కార్యకర్తలు, నాయకులు, పార్టీల అభిమానులకు ముందుగా గుర్తుకొచ్చేది మందు. ఆయా ఏరియాలను బట్టి రోజుకు కొన్ని వేల సంఖ్యలో మద్యం బాటిళ్లు అమ్ముడు పోతుంటాయి. పొద్దంతా ప్రచారం నిర్వహించే కింది స్థాయి నాయకులు, కార్యకర్తలను కుషీ చేయడానికి మద్యం పంపిణీ తప్పని సరి. ఈ ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తూ.. మద్యం వ్యాపారం చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ఈ నిబంధనలను అతిక్రమిస్తే పెద్ద ఎత్తున చలాన్లు విధించడమే కాకుండా కేసులు సైతం నమోదు చేస్తామంటున్నారు చార్మినార్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సాధిక్ అలీ. మద్యం విక్రయదారులైన వైన్స్, బార్ షాపుల యజమానులు నిబంధనలకు లోబడి వ్యాపారాలను కొనసాగించాలని ఆయన 'సాక్షి'కి తెలిపారు.

ప్రశ్న: మద్యం విక్రయాలపై ఎన్నికల నిబంధనలు ఏం చెబుతున్నాయి..?

- జవాబు: ఎన్నికల నియమావళి ప్రకారం ఎక్కువ మొత్తంలో ఒక వ్యక్తికి మద్యం బాటిళ్లను విక్రయించరాదు. ఒక్కో వ్యక్తికి ఒకేసారి 12 బీర్లు, 6 మద్యం బాటిళ్లు విక్రయించడానికే అనుమతి ఉంది. ఎవరైనా ఒకేసారి ఒక వ్యక్తి కేవలం 12 బీర్లు,



6 మద్యం సీసాలు మాత్రమే వైన్‌షాప్‌ల నుంచి తీసుకెళ్లాల్సి ఉంటుందనే నిబంధన ఉన్నాయి.

ప్రశ్న: ఒకవేళ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే..?

- జవాబు: ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆయా మద్యం దుకాణాల లైసెన్స్‌లను సైతం రద్దు చేస్తాం.

ప్రశ్న: నిబంధనలు ఉల్లంగించినట్లు ఎలా తెలుస్తుంది..?

- జవాబు : తాము తనిఖీలు నిర్వహించినప్పుడు సంబంధిత బార్, వైన్ షాప్‌ల వద్ద నిబంధనలు ఉల్లంగించినట్లు తేలితే చర్యలు తప్పవన్నారు.

ప్రశ్న: ఎన్ని వైన్స్ షాప్‌లు, ఎన్ని బార్ అండ్ రెస్టారెంట్స్ ఉన్నాయి..?

- జవాబు: 14 వైన్స్ షాపులు, 9 బార్ అండ్ రెస్టారెంట్‌లు.

ప్రశ్న: వీటి టైమింగ్స్ ఏమిటి..?

జవాబు: వైన్ షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తెరిచి ఉంచడానికి అనుమతి ఉంది. శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతి ఉంటుంది.

- ప్రశ్న: పాతబస్తీలో ఎన్ని కల్లు దుకాణాలున్నాయి..?
- జవాబు: ప్రస్తుతం పాతబస్తీలోని చార్మినార్ పరిధిలో 8 ఉన్నాయి. గౌలిపురాలో 2, లాల్‌దర్వాజలో 5, ఉప్పుగూడలో–1 కల్లు దుకాణాలు ఉన్నాయి.

ప్రశ్న: కల్లు దుకాణాలు ఎప్పటి నుంచి ఎప్పటి వరకు తెరచి ఉంటాయి..?

- జవాబు: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు కల్లు దుకాణాలు తెరిచి ఉంటాయి.

ప్రశ్న: సమయపాలన పాటించకపోతే..?

- జవాబు: సమయపాలన పాటించని నిర్వాహకులపై కేసులు నమోదు చేసి భారీ మొత్తంలో చలాన్లు విధిస్తాం.

# యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఖాలీద్‌అలీఖాన్

గోల్కొండ: సమాజ సేవా కార్యక్రమాల్లో యువత పెద్దఎత్తున పాల్గొనాలని దీన్ని వల్ల వారిలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం గోల్కొండ జీఎంకే ప్రైమ్ గార్డెన్‌లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ అధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ గత 13 ఏళ్లుగా తమ ఆర్గనైజేషన్ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను ఆయనకు వివరించారు. వందలాది కూలే కాపురాలను కౌన్సిలింగ్ ద్వారా తాము నిలబెట్టామన్నారు. కుటుంబ కలహాలతో తమ దగ్గరకు వచ్చిన వారిని పలుమార్లు కౌన్సిలింగ్ నిర్వహించి వారు కలిసిమెలిసి ఉండేలా చూశామన్నారు. ప్రతిభ ఉండి చదువులకు నోచుకోని నిరుపేదలు ఎందరో ఉన్నారని ఇటువంటి వారికి సరైన మార్గదర్శనం చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే వారికి తన మద్దతు ఎప్పుడు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టిఎఫ్‌సిఓ ఎమ్మెల్యేను సన్మానించి మెమోంటో అందజేశారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ పార్టీ కమిటీ ప్రతినిధులకు మెమోంటోలను అందజేశారు. టీఎఫ్‌సిఓ ప్రతినిధి ఖాలీద్ అలీఖాన్, పాషాభాయ్, షకీల్ అలీఖాన్, ఆరూన్‌ఫరాన్, బదరుద్దీన్ తదితరులున్నారు.

### నెలాఖరులోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి


పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: ఓటర్ లిస్టులో తమ పేర్లు లేకపోతే వెంటనే తమ పేర్లను నమోదు చేయించుకోవాలని అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పంకజ్‌కుమార్ అగర్వాల్ సూచించారు. ఈ నెల 31 వరకు తమ పేర్లను కొత్తగా నమోదు చేసుకోవడానికి అవకాశాలున్నాయన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

### రేపు తారామతి బారాదరిలో నాట్య తోరణం

గోల్కొండ: ఈనెల 28న గోల్కొండ తారమతి–బారాదరిలో నాట్య తోరణం నిర్వహిస్తున్నామని అమృత కల్చరల్ ట్రస్ట్ మెనేజింగ్ ట్రస్టీ భార్గవి పగడాల తెలిపారు. హైదరాబాద్ క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్ పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కూచిపూడి, భరతనాట్యం, మోహిని అట్టం, ఒడిసీ, కథక్‌లతో పాటు నాట్య గురువు కళాకృష్ణ బృందం పేరిణి శివతాండవం కార్యక్రమం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ నాట్య ప్రదర్శనకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. నాట్యరంగంలో ఉత్సాహవంతులైన యువతను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, డీఐజీ సుమతి తదితరులు పాల్గొంటారని ఆమె వివరించారు.

# వైద్యులు సమయపాలన పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

చార్మినార్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే.. శాఖాపరమైన చర్యలు తప్పవని చార్మినార్ జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రాజశ్రీ హెచ్చరించారు. గురువారం జోన్ పరిధిలోని బస్తీ దవాఖానాలకు చెందిన వైద్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజూ తప్పనిసరిగా సమయానికి ఆయా బస్తీ దవాఖానాలలో సంబంధిత వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. సమయానికి రావడమే కాకుండా రోజూ 5 మందికి టెలి మెడిసిన్ కాల్స్ చేయడం, దవాఖానాలలో సరిపడా మందులను అందుబాటులో ఉంచుకుని అవసరమైన ప్రతి రోగికి మందులను అందజేయాలన్నారు. మహిళలకు ఇతరాత్ర ఆరోగ్య సమస్యలున్నట్టు తెలిస్తే.. వెంటనే వారిని దగ్గరలోని యూపీహెచ్‌సీలకు రిఫర్ చేయాలన్నారు. యూపీహెచ్‌సీలలో 70 శాతం డెలివరీలను నార్మల్‌గా జరిగేటట్లు చూడాలన్నారు. డాక్టర్ సునంద, డాక్టర్ బ్రిడ్జిస్, డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ రఫీక్ తదితరులున్నారు.

### 31న 'నేను నా రచనలు'

సుల్తాన్‌బజార్: 'నేను నా రచనలు' అనే కొత్త కార్యక్రమాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ ప్రారంభించనున్నట్లు పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత కవి రచయితలు, పరిశోధకులు, విమర్శకుల స్వీయజీవిత, సాహిత్య విశేషాలను పాఠకులతో పంచుకునే ప్రసంగ పరంపర అనే కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 31న సాయంత్రం 5.30 గంటలకు పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సలీం మొదటి వక్తగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వివరించారు.

# పోలీసుల కార్డన్ సెర్చ్


ఇంద్రనగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

అబిడ్స్: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గోషామహల్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి స్వీయ పర్యవేక్షణలో అదనపు డీసీపీ అష్ఫక్, గోషామహాల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఆసీఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, కుల్సుంపురా ఏసీపీ జావిద్, గోల్కొండ ఏసీపీ ఫయాజ్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్‌లతో పాటు జోన్‌కు చెందిన పలువురు ఇన్‌స్పెక్టర్‌లతో పాటు 120 మంది పోలీసులు దాదాపు 4 గంటల పాటు సోదాలు నిర్వహించారు.

- ఇందిరానగర్‌లోని 271 నివాసాలను పోలీసులు సోదాలు చేసి 8.8 లీటర్ల మద్యం, 1150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పత్రాలు లేని 46 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.
- గత 6 నెలలుగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న 6 మంది రౌడీషీటర్‌లను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్‌లు మాట్లాడుతూ.. ఈ కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌లో ఇందిరానగర్‌లోని 271 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఎన్నికల నేపథ్యంలో రోజూ ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించకుండా పూర్తిస్థాయిలో నిఘా ఏర్పాటు చేశామని, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు.

### ఎన్నికల నియమావళిని పాటించాలి


సమావేశంలో చార్మినార్ రిటర్నింగ్ అధికారి వెంకన్న

చార్మినార్: ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని చార్మినార్ శాసనసభ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి,జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. గురువారం మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని రిటర్నింగ్ కార్యాలయంలో సహాయ రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏ అధికారి పని చేయరాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తమ విధినిర్వహణ కొనసాగించాలన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారులు డీడీ నాయక్, చాముండేశ్వరి, అబ్దుల్ ఖాదర్, నిహారిక తదితరులున్నారు.

# వేర్వేరు చోట్ల అక్రమంగా తరలిస్తున్న నగదు స్వాధీనం


నగదును ప్రదర్శిస్తున్న ఏసీపీ బాలగంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ముత్తులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

సుల్తాన్‌బజార్: అక్రమంగా తరలిస్తున్న రూ.14,75,200లను సుల్తాన్‌బజార్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారంఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోఠి గుజరాతి గల్లీ వద్ద ఎస్సై నరేష్, శ్వేతలతో కలిసి ఇన్‌స్పెక్టర్ ముత్తు తనిఖీలు నిర్వహిస్తుండగా.. గుజరాతి గల్లీ వద్ద చార్మినార్‌కు చెందిన అక్షయ్‌కుమార్, మహ్మద్‌రఫీలు రూ.7,69,300లను అక్రమంగా తరలిస్తున్నారని తనిఖీల్లో తేలగా.. నగదును పోలీసు స్వాధీనం చేసుకున్నారు. బేగంపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ సైతం రూ.7,05,900లను అక్రమంగా తరలిస్తుండటంతో ఆ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి పర్యవేక్షణలో ఈ తనిఖీలు నిర్వహించామని ఇన్‌స్పెక్టర్ ముత్తు తెలిపారు.

**చార్మినార్ పోలీసుల నాకాబందీలో రూ.5 లక్షలు..**

దూద్‌బౌలి: చార్మినార్ పోలీసులు నిర్వహించిన నాకాబందీలో భాగంగా వాహనాల తనిఖీల్లో లెక్కల్లో లేని రూ.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కాళీకమాన్ వద్ద తనిఖీలు చేపట్టగా.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ ద్విచక్ర వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5 లక్షల నగదు లభించిందని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. పూర్తి సమాచారాన్ని చార్మినార్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి అందజేసినట్లు ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు.

### స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు



చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు డీఆర్‌సీకి చేరుకున్నాయి. చార్మినార్ నియోజక వర్గం డిస్ట్రిబ్యూటింగ్ అండ్ రిసీవింగ్ సెంటర్ (డీఆర్‌సీ)ని నాంపల్లిలోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేశారు. ఇక్కడి స్ట్రాంగ్ రూంలో గురువారం రాత్రి వీటిని భద్రపరిచారు.

### బీజేపీ గూటికి బీఆర్ఎస్ నేత !

గోల్కొండ: గుడిమల్కాపూర్‌కు చెందిన ఓ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బీజేపీ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన గతంలో బీఆర్ఎస్ తరపున కార్పొరేటర్‌గా కూడా గెలిచాడు. గత బల్దియా ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్‌ను పలువురు బీజేపీ సీనియర్ నాయకులు బీజేపీలోకి రమ్మంటూ ఆహ్వానిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సూచనల మేరకే ఆ మాజీ కార్పొరేటర్‌ను తిరిగి బీజేపీలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాంపల్లి నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇస్తామంటూ కూడా పలువురు నాయకులు ఆయనకు చెబుతున్నట్లు సమాచారం.

### రాజ్‌పుత్ రజకులకు అవకాశం కల్పించాలని వినతి



నాంపల్లి: రాజ్‌పుత్ రజక కులస్తులకు ఈ దఫా ఎన్నికల్లో నాంపల్లి నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే టికెట్‌ను కేటాయించాలని ఆ పార్టీ నేత మహేందర్ సింగ్ కోరారు. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు రాజ్‌పుత్ రజక కులస్తులకు అవకాశం ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా రజక కులస్తులు ఉన్నట్లు వివరించారు. రాజకీయంగా వెనుకబడిన రజకులకు టికెట్ కేటాయిస్తే నాంపల్లి నుంచి బీజేపీ గెలుపు సునాయసం అవుతుందన్నారు. పార్టీ టికెట్‌ను తనకు కేటాయించాలని ఇదివరకే దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. తన దరఖాస్తును పరిశీలించి అధిష్టానం ఆమోదంతో ఒక అవకాశం కల్పించాలని కోరారు.

### అమర్‌సింగ్ ప్రత్యేక పూజలు


కార్వాన్ కట్టమైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న అమర్‌సింగ్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దెబ్బకు బీఆర్ఎస్ పార్టీ క్లీన్ బౌల్డ్ అవుతుందని కార్వాన్ బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి కార్వాన్‌లోని కట్టమైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ యదేచ్ఛగా దోచుకున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతి ఫుల్‌గా సాగుతుందని బీఆర్ఎస్ మంత్రులే స్వయంగా అవినీతికి సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు అవినీతి రహిత స్వచ్ఛమైన పాలన కోరుకుంటున్నారన్నారు. అందువల్లే ప్రజలంతా ఏకపక్షంగా బీజేపీ వైపు ఉన్నారని ఆయన అభిప్రాయపడ్డారు. గత పదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగం బాగా పెరిగిందని నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. సంక్షేమ పథకాలంటూ సీఎం కేసీఆర్ అర్హులైన వారిని పక్కనపెడుతూ బీఆర్ఎస్ అనుకూలులకే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు సచిన్ కామ్లెకర్ తదితరులున్నారు.

### ప్రజా ఏక్తా పార్టీ మేనిఫెస్టో విడుదల

అఫ్జల్‌గంజ్ : ప్రజా ఏక్తా పార్టీ అధికారంలోకి వస్తే పంచ ప్రాణాలు అమలు చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం మహారాజ్‌గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులతో కలిసి మెనిఫెస్టోను విడుదల చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం, పాడి పంటలే ప్రాణం పేరుతో పదెకరాల వరకు ప్రభుత్వమే పెట్టుబడి పెడుతుందని, డైరీని బలోపేతం చేస్తామన్నారు. మహిళ మహారాణి పేరుతో రూ.3000 నుంచి రూ.10,000 వరకు ప్రతినెల అందజేస్తామన్నారు. 'నేటి బాలలే రేపటి పౌరులు' పేరుతో రూ.3000 నుంచి రూ. 10,000 వరకు ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.



### గోషామహల్‌లో హ్యాట్రిక్ సాధిస్తా !


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: గోషామహల్‌లో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సృష్టిస్తానని గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రాజాసింగ్ అన్నారు. పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం తొలిసారి ఎన్నికల ప్రచారాన్ని గురువారం దత్తాత్రేయనగర్ డివిజన్ నుంచి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పాదయాత్ర చేసి మరోసారి తనకు మద్దతు ఇచ్చి గెలిపించాల్సిందిగా ప్రజలను అభ్యర్థించారు. గతంలో ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు గణేష్‌యాదవ్ తదితరులున్నారు.

# బీఎల్‌ఓలు ఓటరు నమోదును చేపట్టాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రిటర్నింగ్ అధికారి విక్టర్

అబిడ్స్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఎల్‌ఓలతో హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ వేసేందుకు వారికి ఇంటింటికీ 12– డీ ఫారాలను అందజేయాలని కోరారు. నూతన ఓటరు నమోదుకు ఈనెల 30 వరకు అవకాశం కల్పించడంతో అంతలోపు ఫారమ్– 6 ద్వారా నూతన ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్ వీఆర్‌ఓ జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలయ్య ఏఆర్‌ఓలు, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.